ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



వరద బాధితులకు 'విజయం' రూ.10 లక్షల విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరులోని విజయం విద్యాసంస్థల తరపున అధినేత డాక్టర్ తేజోమూర్తి, అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజామూర్తి 10,00,116రూపాయలను విరాళంగా సీఎం చంద్రబాబుకు అందజేశారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి విద్యాసంస్థలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సేకరించిన మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా కాణిపాక వరసిద్ధుడి బ్రహోత్సవాల్లో భాగంగా గణనాథుడి ఆలయంలో నిర్వహించిన వేలంలో రూ.4.25 లక్షలకు సొంతం చేసుకున్న 21 కిలోల ప్రత్యేక లడ్డూను సీఎంకు అందజేశారు. వీరి వెంట విజయం విద్యాసంస్థల ఏవో రాజగోపాల్, లైజనింగ్ అధికారి రమేష్‌బాబు ఉన్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

తెలంగాణ డీఎస్సీలో పలమనేరు అమ్మాయికి ఫస్ట్ ర్యాంకు



ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణలో నిర్వహించిన డీఎస్సీలో పలమనేరుకు చెందిన తహసీన్ ప్రథమర్యాంక్ సాధించారు. హైదరాబాద్ జిల్లాలో పరీక్ష రాసిన పలమనేరువాసి షేక్ తహసీన్ 75.57 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించారు.పదవతరగతి,ఇంటర్ పరీక్షల్లో కూడా తహసిన్ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు.షేక్ తహసీన్ మొదటి ర్యాంకు సాధించడం పట్ల ఆప్టా జనరల్ సెక్రటరీ మునాఫ్ హర్షం వ్యక్తం చేశారు.

- పలమనేరు

క్షేత్ర స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, ఎంపీడీవోల వద్దకు సమస్యలున్న బాధితులు వెళ్లడం తగ్గించేశారు. తమ సమస్యలు చెప్పుకుంటే పరిష్కారమవుతాయనే నమ్మకాన్ని క్షేత్రస్థాయి అధికారులు కల్పించకపోవడంతో నేరుగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి వచ్చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి బృందం సోమవారం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించగా.. అర్జీదారులు కనిపించలేదు. కలెక్టరేట్ మాత్రం ప్రతి సోమవారం అర్జీదారులతో కిటకిటలాడుతోంది.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆంధ్రజ్యోతి విజిట్

బాధితులంతా కలెక్టరేట్‌కే...!

- క్షేత్రస్థాయి అధికారుల వద్దకు వెళ్లని వైనం
- అర్జీదారులకు నమ్మకం కల్పించడంలో మండలస్థాయి యంత్రాంగం విఫలం
- పరిష్కరించకుండానే గ్రీవెన్స్ ఫైళ్లు క్లోజ్

చిత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే జరుగుతున్న తీరును సోమవారం ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది. దాదాపు అన్ని కార్యాలయాల్లో తహసీల్దార్లు 10 నిమిషాలు అటుఇటుగా సమయానికి గ్రీవెన్స్ డేకి హాజరయ్యారు. తహసీల్దార్లు హాజరవ్వని చోట మాత్రం డిప్యూటీ తహసీల్దార్లు బాధ్యత తీసుకున్నారు. కొన్నిచోట్ల కిందిస్థాయి సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. అధికారులు సమయానికి వచ్చినా అర్జీదారులు మాత్రం తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపించలేదు.జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు 250మంది హాజరై, తమ గోడు చెప్పుకున్నారు. ఎన్నిసార్లు అర్జీలిచ్చినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు గోడువెళ్లబోసుకున్నారు.

క్షేత్రస్థాయి అధికారులను కమ్మిన నిర్లక్ష్యం

క్షేత్రస్థాయిలో బాధితులకు అండగా నిలవాల్సిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమస్యల్ని పట్టించుకుని పరిష్కరిస్తారన్న నమ్మకం కల్పించడంలో విఫలమవుతున్నారు.కొత్తగా ఏర్పడిన పలమనేరు, కుప్పం, నగరి రెవెన్యూ డివిజన్లలో రికార్డులు పూర్తిస్థాయిలో మారక పోవడంతో సమస్యలు అధికంగా వస్తున్నాయి. దీనిపై ఆర్డీవోలు చొరవ తీసుకోవడం లేదని చెబుతున్నారు.

నిర్లక్ష్యం నిండిన 26 మందికి షోకాజ్

బాధితులకు నమ్మకం కల్పించడంలో విఫలమవడం అనే విషయాన్ని పక్కనపెడితే.. చివరికి కలెక్టరేట్ నుంచి సిఫార్సు చేసిన అర్జీలను కూడా మండలస్థాయిలో సరిగా పరిష్కరించడం లేదు. క్షేత్ర స్థాయిలో సమస్యను విచారించి, పరిష్కరించి ఆ ఫైల్‌ను క్లోజ్ చేయాల్సి ఉంది. విచారించకుండా కొందరు, తప్పుడు సమాచారంతో మరికొందరు ఫైళ్లను క్లోజ్ చేసేస్తున్నారు. దీన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ తీవ్రంగా పరిగణించి.. సోమవారం 26మంది మండలస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించారు. వారిలో బంగారుపాళ్యం, పూతలపట్టు, శాంతిపురం, వెదురుకుప్పం, పెద్దపంజాణి తహసీల్దార్లు.. చిత్తూరు వన్ టౌన్ సీఐ, బైరెడ్డిపల్లె, రాళ్లబుదుగూరు, సోమల, తవణంపల్లె, వెదురుకుప్పం ఎస్ఐలు, రామకుప్పం, ఐరాల విద్యుత్తు శాఖ ఏఈలు.. బంగారుపాళ్యం ఏపీఎం, జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం, సోమల మండలంలోని పెద్దఉప్పరపల్లె పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక డెస్క్

కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీలను మండల అధికారులకు పంపిస్తే కొందరు సరిగా పట్టించుకోకపోవడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశారు. దీంట్లో పని చేసేందుకు ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు.వీరు రోజూ ర్యాండమ్‌గా 15మంది అర్జీదారులకు ఫోన్ చేసి.. వారి సమస్య నిజంగానే పరిష్కారమైందా.. లేదా.. అని అడిగి తెలుసుకుంటారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు జాయింట్ కలెక్టర్‌కు అందించి, సంబంధిత తహసీల్దార్లకు కూడా పార్వర్డ్ చేస్తారు.రెండు మూడు రోజుల్లో ఈ కొత్త విధానం ప్రారంభం కానుంది.

మూడు నెలల్లో 7843 అర్జీలు

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌లో ప్రతి వారం, కుప్పంలో పక్షం రోజులకు ఓసారి నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాల్లో 7843 అర్జీలు వచ్చాయి. వీటిలో అధికారుల లెక్కల ప్రకారం 5553 పరిష్కారమయ్యాయి. 2252 అర్జీలు పెండింగులో ఉన్నాయి. మిగిలినవి ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. వచ్చిన అర్జీల్లో సగానికిపైగా (4357) రెవెన్యూ సంబంధిత అర్జీలే వచ్చాయి. పోలీసు 746, సర్వే సెటిల్‌మెంట్స్ 447, మున్సిపల్ 229, వెలుగు (సెర్ప్) 229, హౌసింగ్ 214... ఇలా అర్జీలు అందాయి.

తహసీల్దార్లు బాధ్యతగా పనిచేయాలి: కలెక్టర్

ప్రజలందించే అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయి అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. చిన్న సమస్య ఉన్నా ప్రజలు నేరుగా కలెక్టరేట్‌కు వస్తున్నారు. తహసీల్దార్లు సక్రమంగా పనిచేసి వారి సమస్యల్ని అక్కడే పరిష్కరిస్తే ఇలా రావాల్సిన అవసరం ఉండదు. గ్రీవెన్స్ డే అర్జీలను పరిష్కరించకపోయినా, తప్పుడు సమాచారంతో క్లోజ్ చేసినా ఇక నుంచి తీవ్ర చర్యలుంటాయి. అందుకే సోమవారం ఒక్క రోజే 26 మంది అధికారులకు షోకాజ్ నోటీసులిచ్చాం.అర్జీల ప్రోగ్రెస్ తెలుసుకోవడం కోసం ఇక నుంచి ప్రత్యేక డెస్క్ ఏర్పాటుచేసి ఫాలోఅప్ చేస్తాం.

ఆరేళ్ల బాలిక అదృశ్యం

- 11 పోలీసు బృందాలతో గాలింపు



అస్వియా



గాలిస్తున్న డాగ్‌స్క్వాడ్

పుంగనూరు, సెప్టెంబరు 30 : పుంగనూరులో ఆరేళ్ల బాలిక అదృశ్యంపై కలకలం రేగింది. ఆదివారం రాత్రి నుంచి పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పుంగనూరు ఉబేదుల్లాకాంపౌండ్‌కు చెందిన అజ్మతుల్లా కుమార్తె అస్వియా(6) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఇంటి వద్ద ఆడుకుంటుండగా కరెంటు పోయింది. దీంతో అస్వియా తల్లి బయటకు వచ్చి చూడగా కుమార్తె కన్పించలేదు. భర్త అజ్మతుల్లాకు ఆమె ఫోన్ ద్వారా విషయం తెలియజేసింది. బాలిక కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రాత్రి 10.30గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఎస్పీ మణికంఠ ఆదేశాలతో 11పోలీసు బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. రెండు డాగ్‌స్క్వాడ్ బృందాలు కూడా పలువీధుల్లో గాలించారు. సోమవారం సాయంత్రం ఆస్వియా ఇంటికి వెళ్లిన ఎస్పీ మణికంఠ పాప కుటుంబీకులను విచారించారు. క్లూస్ టీం ద్వారా వచ్చిన సమాచారంపై పోలీసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. చిన్నారి తండ్రి ఫైనాన్స్ వ్యాపారి కావడంతో అనుమానితులుగా ఉన్న వారిని విచారిస్తున్నామని చెప్పారు. డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్ తదితరులు ఆయన వెంట వున్నారు.



అస్వియా కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ



వారాహిసభ స్థలాన్ని పరిశీలిస్తున్న జనసేన నాయకులు, పోలీసులు

పూలే కూడలిలో వారాహి సభ!

పవన్‌కల్యాణ్ వారాహి సభ నిర్వహణ కోసం జ్యోతిరావు పూలే విగ్రహ కూడలిని ఖరారు చేసినట్లు తెలిసింది. తొలుత దీంతో పాటు లీలామహల్, అన్నమయ్య కూడళ్లను ఎంపిక చేశారు. సోమవారం ఈ మూడింటిని పరిశీలించిన జనసేన నేతలు, పోలీసులు ట్రాఫిక్ సమస్య, ప్రయాణికుల ఇబ్బందులు ఉండని, ఎక్కువ మంది గుమికూడేందుకు అవకాశం ఉన్న పూలే విగ్రహ కూడలిని ఎంపిక చేసినట్లు సమాచారం. వారాహిసభ గురువారం సాయంత్రం 5నుంచి 7.30 గంటల వరకు కొనసాగనుంది. సభాస్థలిని పరిశీలించినవారిలో రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కేకే శ్రీనివాస్, జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ఆరణి శివ, పవన్, బాలాజీ తదితరులతో పాటు వెస్ట్ సీఐ రామకృష్ణ ఉన్నారు.

ప్రాయశ్చిత్త దీక్ష విరమణకు

నేడు పవన్ రాక



- తిరుమలలో మూడు రోజులు
- 3న తిరుపతిలో వారాహి సభ

తిరుపతి, ఆంధ్రజ్యోతి/తిరుపతి అర్బన్/తిరుపతి (కలెక్టరేట్): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. దీక్ష విరమణకుగాను మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతికి రానున్నారు. సాయంత్రం 4గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన అలిపిరి పాదాల మండపం వద్దకు చేరుకుంటారు. ప్రత్యేక పూజలు చేసి నడక మార్గం గుండా తిరుమల వెళ్లి రాత్రి బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని పరిశీలించి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. తిరిగి గురువారం సాయంత్రం తిరుపతిలో జరగనున్న వారాహి సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అనంతరం రాత్రి 8.30గంటలకు విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు తిరుగుపయనం అవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీక్ష విరమించేందుకు వస్తున్న పవన్ మూడు రోజుల పాటు తిరుమలలోనే ఉండనున్నారు. లడ్డూ వివాదం నేపథ్యంలో పవన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

43.5శాతం లోటు వర్షపాతం

ఎండిపోతున్న వేరుశనగ పంట

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30: జిల్లావ్యాప్తంగా వర్షాభావ కారణంగా సెప్టెంబరులో 43.5 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈనెల సరాసరి 153.7 మి.మీ సాధారణ వర్షపాతం కాగా, సోమవారం వరకు 86.9 మి.మీ వర్షం కురిసింది. వి.కోటలో సాధారణ వర్షపాతం 170 మి.మీ బదులు నెల పూర్తిగా చుక్క కూడా కురవలేదు. రామకుప్పంలో 163.2 మి.మీ బదులు 97.4 శాతం లోటుతో 13.2 మి.మీ, బైరెడ్డిపల్లెలో 155.8 మి.మీకి బదులు 95.6శాతం లోటుతో 6.8 మి.మీ, కుప్పంలో 191.9 మి.మీకి బదులు 93.1శాతం లోటుతో 13.2 మి.మీ మాత్రమే కురిసింది. జూలైలో కూడా 103.9 మి.మీకి సరాసరి వర్షం బదులు 13.6శాతం లోటుతో 89.8 మి.మీ వర్షం మాత్రమే కురవగా, ఆగస్టులో 122.1 మి.మీ సరాసరి బదులు 13శాతం మాత్రమే అధికంగా 137.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అనువైన రోజుల్లో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయి రైతన్నలకు దిగాలు మిగిల్చింది.

భార్య లేదన్న దిగులుతో వృద్ధుడి ఆత్మహత్య

రామకుప్పం, సెప్టెంబరు 30: భార్య లేదన్న దిగులుతో కర్ణాటకకు చెందిన వృద్ధుడొకరు రామకుప్పం మండలం రాజుపేట సమీప పొలాల్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ......కర్ణాటక రాష్ట్రం క్యాసంబళ్ళ హోబళీ బులవనహళ్ళికి చెందిన గంగప్ప(81), లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. ఓ కుమార్తెను బులవనహళ్ళిలోనే సమీప బంధువుకిచ్చి పెళ్ళి చేశారు. లక్ష్మమ్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది.భార్య లేదన్న దిగులుతో గంగప్ప తాగుడుకు బానిసయ్యాడు. రోజూ లక్ష్మమ్మ కలలో వచ్చి, తన వద్దకు రమ్మంటోందని కుమార్తెకు చెప్పేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గంగప్ప గ్రామం నుంచి వెళ్ళిపోయాడు. సోమవారం ఉదయం రాజుపేట గ్రామ సమీపంలోని రాజప్ప పొలంలో చెట్టుకు శవమై వేలాడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, ఇన్‌చార్జి ఎస్ఐ నరేష్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుడి జేబులోని పేపర్‌లో గల నెంబరుకు ఫోన్ చేసి అయన్ను గంగప్పగా గుర్తించారు.ఆయన కుమార్తె రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బ్రహ్మోత్సవాల వేళ కొండపై

సిట్ సందడి

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఒకవైపు తిరుమల కొండమీద బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీటీడీ అధికారులూ, ఉద్యోగులూ ఆ పనుల్లో తలమునకలై ఉన్నారు. మరోవైపు ఇదే సమయంలో లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏర్పాటైన సిట్ కూడా దూకుడు పెంచింది. సోమవారం తిరుమలలో బృందాలుగా విడిపోయి విచారణ సాగించింది. మూడో రోజు సోమవారం సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐజీ గోపినాథ్‌జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఏఎస్పీ వెంకట్రావు, సభ్యులు తిరుమలలో ఉన్న నెయ్యి, ముడిసరకుల పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేశారు. నెయ్యి ట్యాంకర్లు ఎలా వస్తాయి? నాణ్యతను ఎలా పరీక్షిస్తారు? రికార్డులు ఎలా ఉన్నాయనే అంశాల పరిశీలనతో పాటు కొన్ని రికార్డులను తీసుకున్నారు. తర్వాత నెయ్యి నిల్వ ఉంచే కేంద్రం, నెయ్యి సరఫరా అయ్యే విధానం, బూందీ తయారీ కేంద్రం, ఆలయంలోని లడ్డూ తయారీ పోటును పరిశీలించారు. తర్వాత టీటీడీ ఉన్నతాధికారులు, కొనుగోళ్ల విభాగం అధికారులతో సమీక్షించారు. పలువురు అధికారులు, ఆయా విభాగాల్లోని సిబ్బందితో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా.. లడ్డూలకు వినియోగించే బూందీ తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సిట్ అధికారులు కొంతమంది పోటు కార్మికులతో మాట్లాడారు. ఈసందర్భంగా గతంలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని అప్పటి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని సిట్ బృందానికి కొందరు పోటు కార్మికులు తెలిపినట్టు సమాచారం. నెయ్యిని చూడగానే నాణ్యత ఎలా ఉందో అర్థమైపోతుందని, కానీ గతంలో వాడిన నెయ్యిలో పూర్వపు నెయ్యి నాణ్యత కనిపించలేదని పోటు కార్మికులు సిట్ బృందం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.



తిరుమలలో ల్యాబ్ వద్ద సిట్ సభ్యులు

ఎన్‌డీడీబీకి మరో శాంపిల్?

తిరుమలకు ఓ సంస్థ పంపిన ట్యాంకర్‌లోని నెయ్యిని సిట్ సిబ్బంది శాంపిల్స్ తీశారు. వాటిని పరీక్షించే విధానాన్ని స్వయంగా పరిశీలించడంతో గతంలో నెయ్యిలో కల్తీ జరిగినట్టు నిర్ధారించిన ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు కూడా పంపనున్నట్టు తెలిసింది. ఇప్పటికీ నెయ్యిలో కల్తీ జరుగుతోందా అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

నేడు ఏఆర్ డెయిరీకి హర్షవర్ధన్‌రాజు టీం

శ్రీవారి లడ్డూప్రసాదాలకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని పంపారంటూ విమర్శలు ఎదుర్కొంటున్న తమిళనాడులోని దిండిగల్ ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను విచారించేందుకు సిట్‌కి సంబంధించి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బృందం వెళ్లనుంది. ఏఆర్ డెయిరీ సంస్థకు నాణ్యమైన నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం ఉందా, ఈ సంస్థ కేవలం టీటీడీకి మాత్రమే సరఫరా చేస్తోందా, ఇంకా ఎక్కడికైనా సరఫరా చేస్తోందా అనే అంశాలను తెలుసుకోనున్నారు. అలాగే ఈ సంస్థ నెయ్యి తయారీకి ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తోంది, గతంలో టీటీడీకి ఎన్నిసార్లు సరఫరా చేసిందనే అంశాలపై విచారించనున్నారు. ముఖ్యంగా ఆసంస్థ నుంచి నెయ్యిని తీసుకువస్తున్న వాహనాలు ఎవరివి, ఆ వాహనాల డ్రైవర్లు ఎవరు, ట్యాంకర్ల సామర్థ్యానికి తగ్గట్టుగానే నెయ్యిని తీసుకువస్తున్నారా, మార్గం మధ్యలో ట్యాంకర్లను ఎక్కడైనా నిలుపుతారా, ఒక వేళ కల్తీ జరిగితే ఎక్కడ జరిగే అవకాశముందనే వివిధ కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది. ఇక, ఇప్పటివరకు జరిగిన విచారణలో దాదాపు ఐదుగురు వ్యక్తులు సంబంధం లేకుండా సమాధానాలిస్తున్నట్టు సిట్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

Sri Venkateswara University : Tirupati
e-Procurement Short Tender Notice (7Days)

Tender No. 18/UEO-HD/SVU/TPT/2024-25, Dt. 30-09-2024. For details log on to https://www.tender.apeprocurement.gov.in and Tender Schedule Donwload Ending and Bid submission closing Date : 07-09-2024 at 04.00 P.M. & 05.00 P.M. from Nit No.128 to 148

Sd/- M.BHUPATHI NAIDU,
Registrar, S.V.University, Tirupati

ఒకే సమస్యపై ఎన్నిసార్లు తిరగాలి?

● అధికారుల ఎదుట అర్జీదారుల మొర

చిత్తూరు, సెప్టెంబరు 30: 'మీరేమో ఫోన్లు చేసి మండలస్థాయి అధికారులకు చెబుతున్నారు... వారు సకాలంలో స్పందించడం లేదు.ఏవో కారణాలు చెబుతూనేవున్నారు. మీరే మాకు న్యాయం చేయాలి'... కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల గోడు ఇది.ఒకే సమస్యపై తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యా లయాలకు తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 237మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఇందులో రెవెన్యూశాఖకు సంబంధించే 204 అర్జీలున్నాయి.కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.



గతంలో వేసిన బోరుకు మోటారు అమర్చకపోవడంతో డబ్బు ఖర్చులు పెట్టి నీటిని తెచ్చుకోవాల్సివస్తోందని చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యం పంచాయతిలోని జర్రిమడుగు గిరిజనులు ఫిర్యాదు చేశారు.తమ కాలనీ నుంచి రోడ్డుకు రావాలంటే దారి వసతి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి బోరు మోటారు, పైపులతో పాటు దారి వసతిని కల్పించాలని కోరారు.



ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, గౌరవ వేతనం తీసుకుంటున్న ఉద్యోగులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఎంటీఎస్, హెచ్ఆర్, టీఏ, డీఏ, పీఎఫ్, ఈఎస్ఐపథకాలను అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ నేతలు గిరిధర్ గుప్తా, వాడ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



తమకు భూములు కేటాయించాలని సదుం మండలం బూరగమంద పంచాయతీలోని గాదేవారిపల్లె గిరిజనులు కోరారు. సర్వే నెంబరు 515లో సుమారు ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దీంట్లో పశువులు, మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ భూమిని ఆక్రమించుకుని చదును చేశాడన్నారు.విచారించి భూముల్లేని తమకు పట్టాలివ్వాలని కోరారు.

● తన భూమిని 22(ఎ) జాబితా నుంచి తీయించాలని గుడుపల్లె మండలం గుండ్లసాగరానికి చెందిన శరవణ కోరారు.పక్కా రిజిస్టర్ భూమి అయినప్పటికీ రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల 22(ఎ) ఖాతాలో పడిందన్నారు. పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

● ఆస్తిని మాత్రం రాయించుకుని తన బాగోగులు పట్టించుకోని పెద్ద కుమారుడి నుంచి భూమిని ఇప్పించాలని గంగవరం మండలం సామరాజుపల్లెకు చెందిన బుచ్చమ్మ ఫిర్యాదు చేశారు. తనకు ఏడుగురు కుమారులని, ప్రస్తుతం తాను చిన్న కుమారుడి వద్ద ఉంటున్నానని తెలిపారు. తన భర్తకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని పెద్ద కుమారుడు రాసుకున్నాడని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తన బాగోగులు చూసుకోలేని వాడు ఆస్తిని మాత్రం ఎలా అనుభవిస్తాడని ప్రశ్నించారు. తన భర్త ఆస్తిని తనపై రాసి పెద్దకుమారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఏళ్ల తరబడి వస్తున్న వికలాంగ పింఛన్‌ను గత ప్రభుత్వం ఆపేసిందని ఎస్ఆర్ పురం మండలం ఎస్ఆర్‌పురానికి చెందిన బిచ్చయ్య ఫిర్యాదు చేశారు. స్థానికంగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు.మందులు కూడా కొనుక్కోలేక ఇబ్బంది పడుతున్న తనను ఆదుకోవాలని కోరారు.

● గత ఏడాది అక్టోబరులో ఉమ్మడి చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న 330మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు రోజుల జీతాలను కట్ చేసి ఎవరికిచ్చారో చెప్పాలని పూతలపట్టు మండల బీజేపీ అధ్యక్షుడు నరసింహులు నాయుడు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దినసరి కూలీపై బతుకీడుస్తున్న కార్మికుల జీతాలను తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

● చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కర వేదిక కార్యక్రమానికి 45మంది హాజరయ్యారు. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆస్తి తగాదాలకు సంబంధించి 11, కుటుంబ తగాదాలకు సంబంధించి 10, భూ తగాదాలకు సంబంధించి 10, డబ్బు తగాదాలకు సంబంధించి 8, వేధింపులకు సంబంధించి 3, దారి సమస్యలకు సంబంధించి 2, ఇంటి తగాదాకు సంబంధించి ఒకటి చొప్పున అర్జీలు అందాయి.

బొమ్మయ్యపల్లె సర్పంచ్ చెక్ పవర్ రద్దు

వెదురుకుప్పం, సెప్టెంబరు 30: వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ చొక్కా గోవిందయ్య చెక్ పవర్ రద్దు చేస్తూ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ సభ్యుడు ఎం.పయణి ఆగస్టు 7, 24 తేదీల్లో ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ ఆటంకం కల్గించడం, నిధులు రూ.30,21,479 దుర్వినియోగం చేయడం, 2022 మే 30వ తేదీ నుంచి పంచాయతీ సమావేశాలు నిర్వహించక పోవడంపై సంజాయిషీ కోరుతూ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసినా స్పందించలేదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 30 ప్రకారం 1995 జనవరి 20వతేదీలోని నియమావళి 42(1) కింద మూడో ప్రొవిజన్ మేరకు సర్పంచ్‌కు నిధులు డ్రాచేసే అధికారాన్ని రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 30: జిల్లా సమగ్ర శిక్షలోని సహిత విద్యా విభాగం, భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టుల ఖాళీల భర్తీకి అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుపాళ్యం, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు, సోమల కేంద్రాలకు అనుసంధానమైన భవిత కేంద్రాల్లో పనిచేయాల్సి ఉందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల ఐదో తేదీలోపు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ జిల్లా స్థాయి పోటీలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 30: స్వర్ణాంధ్ర 2047 విజన్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం పీసీఆర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో డీవైఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మండలానికి ముగ్గురు చొప్పున జిల్లా వ్యాప్తంగా 93 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ఎస్.హిమశ్రీ, (జడ్పీహెచ్ఎస్, నలగాంపల్లె), ఏపీ పవిత్ర (జడ్పీహెచ్ఎస్, ఏకాంబర కుప్పం), ఎస్.మదిహా సమన్ (జడ్పీహెచ్ఎస్, కల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో సి.సాయిప్రియ (కేజీబీవీ, రొంపిచెర్ల), ఎల్.అభినయ (జడ్పీహెచ్ఎస్, టీఆర్‌పురం), ఏపీ హేమ (జడ్పీహెచ్ఎస్, మంగళపల్లె) మూడు స్థానాల్లో నిలిచారు. డిబేట్‌లో.. కె.పునీతసాయి (జడ్పీహెచ్ఎస్, మంగళపల్లె), పి.సర్షిశ్రీ (జీహెచ్ఎస్, బంగారుపాళ్యం)లు మొదటి స్థానంలో నిలవగా, సి.రోహిత్ (జడ్పీహెచ్ఎస్, పైపల్లె), సి.నికిత (జీహెచ్ఎస్, ఐరాల)లు ద్వితీయ, ఎం.ఉమామహేశ్వరి, బిహారిక (జడ్పీహెచ్ఎస్, కార్వేటినగరం)లు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి డీవైఈవో ప్రశంసాపత్రాలు అందజేశారు. పలు మండలాల ఎంఈవోలు రమేష్‌బాబు, కె.మోహన్, ప్రసాద్, హసన్‌బాషా పాల్గొన్నారు.

ముగ్గురు లాటరీ టికెట్ల విక్రేతల అరెస్టు

చిత్తూరు, సెప్టెంబరు 30: లాటరీ టికెట్లను విక్రయిస్తున్న ముగ్గురిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా లాటరీ విక్రయాలపై పోలీసులు పటిష్ఠ నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం తోటపాళ్యం జంక్షన్‌లో లాటరీ టికెట్లను అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సామిరెడ్డివీధి మురుగదాస్, బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన కన్నయ్యశెట్టి. ఓబనపల్లె హౌసింగ్ కాలనీ చెందిన దస్తగిరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 35,500 విలువ కలిగిన టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సూత్రధారులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

ఐదుగురిపై కేసు నమోదు

చిత్తూరు, సెప్టెంబరు 30: వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో ఘర్షణ పడిన సంఘటనలో ఐదుగురిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని స్కావెంజర్స్‌కాలనీలో మూడ్రోజుల కిందట ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమం ప్రారంభంకాగానే కోర్టు సమీపంలో తాగిన మత్తులో కొందరు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో దుర్గా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెక్ బౌన్సు కేసులో మహిళకు ఆరునెలల జైలు

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 30: చెక్ బౌన్సు కేసులో ఓ మహిళకు చిత్తూరులోని నాల్గవ కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. చిత్తూరు నగరంలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్న చెరుకూరు పట్టాభి నాయుడు వద్ద బీవీరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న బెంగుళూరు నాయుడు కుమార్తె, శ్రీధర్ చౌదరి భార్య శ్రీదేవి 2014లో రూ.29 లక్షలు అప్పుగా తీసుకుంది. 2015 సెప్టెంబరులో చెరుకూరు పట్టాభి నాయుడికి ఆమె చెక్ ఇవ్వగా, బౌన్సు అయ్యింది. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించగా, ఈ కేసు సోమవారం వాయిదాకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక శ్రీదేవిపై నేరం రుజువు కావడంతో ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బాబాజాన్ తీర్పుచెప్పారు.

అన్‌సీజన్‌లో మామిడి కాయలు



మామిడి కాయలు



రైతు సుబ్రహ్మణ్యంరెడ్డి

ఐరాల, సెప్టెంబరు 30: ఐరాల మండలంలోని చినవెంకటంపల్లెలో తండ్రీకొడుకులైన రైతులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తమ రెండెకరాల్లో తోతాపురి మామిడి చెట్లు పెట్టారు. సేంద్రియ పద్ధతులను అవలంబించారు. ప్రస్తుతం మామిడికి అన్‌సీజన్ అయినా ఒక్కో చెట్టులో కాయ సుమారు కిలోపైగా సైజు వచ్చింది. పంట పూర్తి కావడానికి మరో రెండు నెలల సమయం పడుతుందని సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు.

నేడే సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 30: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల గృహాలకు వెళ్లి అందజేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 2,69,677 మందికి సుమారు రూ.113.77 కోట్లు పంపిణీ చేయనున్నారు. గాంధీ జయంతి సందర్భంగా రెండో తేదీ ప్రభుత్వ సెలవు దినం కావడంతో మిగిలిన వారికి మూడో తేదీ పంపిణీ చేయనున్నారు.

ఎల్లుండి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 30: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం నుంచి దసరా సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఈనెల 12వ తేదీ వరకు (10 రోజులు) దసరా సెలవులు కాగా, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2, 13, ఆదివారం రావడంతో మొత్తం 12 రోజులపాటు పాఠశాలలకు సెలవులు రానున్నాయి. దీంతో ఈనెల 14న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

బోయకొండ గంగమ్మ దసరా ఉత్సవాలకు రండి

కలెక్టర్‌ను ఆహ్వానించిన ఆలయ ఈవో



కలెక్టర్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఈవో ఏకాంబరం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30: బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఈనెల నాలుగు నుంచి 12వ తేదీ వరకు కొనసాగే దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆలయ ఈవో ఏకాంబరం కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ఆహ్వానపత్రిక, ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్యలకు ఆహ్వాన పత్రికలిచ్చారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు నోటిఫికేషన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 30: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబరు 21వ తేదీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు తుది గడువు. జరిమానాతో 31వ తేదీ దాకా అవకాశం ఉంది. నవంబరులో పరీక్షలు నిర్వహించనున్నట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

పన్నులపై అధ్యయనం కోసం బెంగళూరుకు పుత్తూరు కమిషనర్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: ఇంటి పన్నుల అధ్యయనం కోసం పురపాలక శాఖ రాయలసీమ జిల్లాల రీజనల్ డైరెక్టర్‌తో పాటు పుత్తూరు, కల్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్లతో కూడిన బృందాన్ని రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. ఆర్డీ విశ్వనాథ్, పుత్తూరు కమిషనర్ మంజునాథ గౌడ్, కల్యాణదుర్గం కమిషనర్ సోమవారం బెంగుళూరు కార్పొరేషన్‌కు బయలుదేరి వెళ్లారు. కర్ణాటక రాష్ట్రంలో ఇంటి పన్నుల శ్లాబులు, వసూళ్ల తదితర అంశాల్లో వ్యత్యాసాలను కమిటీ అధ్యయనం చేయనుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అధ్యయనం చేయనున్నారు.

సెలవుపై పుత్తూరు సీడీపీవో

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: పుత్తూరు సీడీపీవో పద్మలత అనారోగ్య కారణంగా రెండు నెలల సెలవుపై వెళ్లనున్నారు. 2015 నుంచి ఆమె పుత్తూరు సీడీపీవోగా కొనసాగుతున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సీడీపీవోగా ఉన్న పద్మలత 2019లో మూడు నెలలు సెలవుపై వెళ్లి తిరిగి పుత్తూరులో కొనసాగడం గమనార్హం.

మొగిలిఘాట్‌లో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసు కటౌట్ ఏర్పాటు



మొగిలి ఘాట్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసు కటౌట్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 30: బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణే ధ్యేయంగా సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి సోమవారం దొరచెరువు మలుపు వద్ద ట్రాఫిక్ పోలీసు కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇంటర్‌సెప్టార్ వాహనంలో స్పీడ్ గన్ సాయంతో అతివేగంగా వెళ్తున్న సుమారు 17 వాహనాలకు రూ.7395 జరిమానా విధించినట్లు తెలిపారు

ప్రమాదాల నివారణకు వీధిలైట్లు ఏర్పాటు చేయండి



రాజేష్

మొగిలి ఘాట్‌లో తరచూ రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతోంది. మొగిలి నుండి దాటిన వెంటనే కారుమబ్బు చీకటిగా ఉంటుంది. పాదచారులకు రోడ్డుమార్గాన వెళ్లాలంటే ప్రాణం గుప్పిట్లో వెళ్లాల్సిందే. వచ్చిపోయే వాహనాలకు లైట్ వెలుతురు ఉంటే ప్రక్కన నడుచుకుని వెళ్లేవారిని గుర్తించేందుకు వాహనదారులకు వీలౌతుంది. గతంలో పలు సందర్భాల్లో తిరుమలకు నడిచివెళ్ళే పలువురు భక్తులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ఏనుగులు కూడా ఆ మార్గాన రోడ్డు దాటుతుంటాయి. గత రెండునెలల క్రితంఓ పాదచారుడిని ఏనుగు తొక్కి చంపేసింది. అలాగే ఏనుగులు రోడ్డు దాటుతుంటే వాహనదారుడికి కనబడకపోవడంతో ప్రమాదం జరిగి ఏనుగులు మరణించాయి. అదే లైట్లు కాని ఏర్పాటు చేస్తే ఈ ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చు. మొగిలి నుండి ఆంజనేయస్వామి ఆలయం వరకు తప్పకుండా లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను వేడుకుంటున్నా. నిత్యం ప్రమాదాలను చూసి భయాందోళనలకు గురౌతున్నాం.

- రాజేష్, ఇంద్రానగర్ గ్రామం, పాలమాకులపల్లె పంచాయతీ

సంక్షేమ పథకాలకు దూరంగా 60వేల మంది గిరిజనులు

ఎస్టీ హేబిటేషన్లలో నవంబరు 15లోగా జనన, ఆధార్ కార్డులివ్వండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30: జిల్లాలోని 588 గిరిజన హేబిటేషన్లలో ఉంటున్న సుమారు 60వేల మంది గిరిజనులకు ఆధార్ కార్డుల్లేని కారణంగా ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాంటి గిరిజనులందరికీ నవంబరు 15వ తేదీలోగా జనన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. అవసరమైనచోట్ల సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమవ్వాలని ఆదేశాలిచ్చారు. సమావేశంలో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

రేపటిలోగా అదనపు పోలింగ్ బూత్‌లకు ప్రతిపాదనలు ఇవ్వండి: జేసీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30: జిల్లాలో ప్రస్తుతమున్న 1,762 పోలింగ్ బూత్‌లతోపాటు అదనంగా ఏర్పాటుకు బుధవారంలోగా ప్రతిపాదనలు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జేసీ విద్యాధరి సూచించారు. సోమవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 14 పోలింగ్ కేంద్రాల లోకేషన్, ఆరు పోలింగ్ కేంద్రాల చిరునామాల మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బాలసుబ్రహ్మణ్యం, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి, కొండయ్య, ఉదయ్ కుమార్, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు. కాగా, స్థానిక ఈవీఎం గోడౌన్‌ను డీఆర్వో పుల్లయ్య రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పరిశీలించారు.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీసిటీ, సెప్టెంబరు 30: టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో 2023 - 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్ (బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్) అవార్డును రాష్ట్ర ప్రభుత్వం నుంచి శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్ హోటల్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆతిథ్య సేవలకు గాను ఈగుర్తింపు దక్కింది. టూరిజం అండ్ కల్చరల్ సెక్రటరీ వినయ్‌చంద్, టూరిజం అథారిటీ సీఈవో ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు.

స్విమ్స్‌లో పీజీ కోర్సులకు 2వ కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 30: శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ(నర్సింగ్), ఎంఎస్సీ, ఎంహెచ్ఎస్, పీజీ డిప్లొమా కోర్సులకు అక్టోబరు 4న ఉదయం 8.30 గంటలకు 2వ విడత కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ సోమవారం తెలిపారు. ఎంఎస్సీ(నర్సింగ్)19, ఎంఎస్సీ క్లినికల్ వైరాలజీ 1, ఎంఎస్సీ కార్డియాక్ కాథెటరిజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ 1, ఎంఎస్సీ కార్డియో పల్మనరీ పర్ఫ్యూషన్ టెక్నాలజీ 2, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్ సైన్సెస్ 7, పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రోగ్రాంకు 23.. మొత్తం 53 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు పొందిన వెంటనే నిర్ణిత ఫీజును చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Kovuri Tirumala (Old Name), R/o: 19-7-272/212, 2nd Lane, Sai Baba Colony, Ponnur Road, Guntur Dt, A.P. Do Here By Declared I Have Changed My Name As Kovuri Venkata Naga Thirumala (New Name) W/o Kovuri Venkatesh.
AJT - X

WANTED
Wanted Waiters, Experienced, Salary. 12,000, Working hours 10hr. Free Food n Accommodation. Phone : .70935 43337
AJT - 4321

PLOTS FOR SALE
నేషనల్ హైవే అనుకొని IISER వెనుకవైపు ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు, అన్నీ సదుపాయాలతో అతి తక్కువ ధరకే డైరెక్ట్ ఓనర్ ఫోన్ : 95027 74175 / 74162 11984.
AJT - 4331

PLOTS FOR SALE
తిరుపతి- తిరుచానూరు రిలైన్స్ హైవేకు గల Toyoto Showroom ఎదురుగా తిరుపతి TUDA వారు అభివృద్ధి చేస్తున్న TUDA లేఔట్‌కు వెళ్లే 200 FEETS దారిలో రోడ్డుకు అనుకొని All Developmentsతో నూతన తుడా అప్రూవల్ లేఔట్ సూరప్ప కశం నందు 60 X 33 కొలతల వెస్ట్ ఫేసింగ్ గల 100% వాస్తుతో 2 Plots మాత్రమే అమ్మకమునకు కలవు. సంప్ర. 90100 22254.
AJT - 4328

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిలైన్స్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA - 198089

PASSPORT MISSING
"Passport No. A479720" issued on Dt. 31-12-1990 at Hyderabad that expired on Dt. 31-12-2000 belonging to "Koppuravuri Babu" S/o Late Koppuravuri Nagendra Rao, residing at D.No. 6-7-602, Sripuram Colony, KT Road, Tirupati of Andhra Pradesh. He lost his passport near SV University Campus. If anyone finds it, Please inform the same at 9246 99 8306.
AJT - X

WANTED VILLA
Wanted 4 or 5 Bed Room East / North facing Villa / Individual House for rent purpose in Tirupati for a Business Family. Cont. : 90102 03671
AJN - 1291

LAND FOR LEASE
వ్యవసాయం భూమి లీజుకు కావలెను. 5 ఎకరాల నుండి 10 ఎకరాల వరకు. తిరుపతి నుండి 10 నుండి 15 కి.మీ. లోపు. సంప్ర. : 91777 27987.
AJT - 200553

WANTED
→ WANTED MALE AND FEMALE WORK from MNC COMPANY, Qul : 10th to DEGREE, Sal : 15K-25K, Contact : 8121818692
AJG-9051

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, దాని వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గోకులం షెడ్ల నిర్మాణ పనుల ప్రారంభం

కుప్పం రూరల్, సెప్టెంబరు 30: కుప్పం మండలంలోని గరిగచీనేపల్లె ఎస్సీ కాలనీ, చెక్కునత్తం ఎస్సీ కాలనీలలో గోకులం షెడ్ల నిర్మాణం పనులను అధికార పార్టీ నాయకులు, అధికారులు కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో ధ్వంసమైన నియోజకవర్గం నేడు ఊపిరి పీల్చుకుని అభివృద్ధి వెంట పరుగులు తీస్తున్నదని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్లను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, చెక్కునత్తం మణి, ఎన్ఆర్‌జీఎస్ జేఈ, ఇన్‌చార్జి ఏపీవో జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ఉపాధి అవకాశాలు

కుప్పం, సెప్టెంబరు 30: సాంకేతిక విద్యలో సృజనాత్మకతను పెంచుకుంటే ఉపాధి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ వై.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలోని వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సృజనాత్మకత, క్లిష్టమైన ఆలోచన విధానాలు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా సాఫ్ట్ స్కిల్స్, ఆలోచనా విధానం ప్రాధాన్యత వివరించారు. సృజనాత్మకత పెరడానికి లెఫ్ట్ బ్రెయిన్, రైట్ బ్రెయిన్‌ల మధ్య సమన్వయం ఏర్పడడానికి కావాల్సిన మెళకువలు తెలియజేశారు. వివిధ విధానాలతో వస్తువులతో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బన్న, జనరల్ సెక్షన్ ఇన్‌చార్జి సయ్యద్ హుస్సేన్ మియాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధ్యాపకులు నరసింహులు, నిరంజన్, వరుణ్, జోసెఫ్, రసాయన శాస్త్ర అధ్యాపకులు జీఎస్.రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టమీదపల్లిలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా

కల్లూరు, సెప్టెంబరు 30: పాళెం పంచాయతీ గుట్టమీదపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరగా ప్రతి రోజూ ట్యాంకర్ ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతమి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ గుట్టమీదపల్లెకు సరఫరా చేస్తున్న ప్రభుత్వ మంచినీటి బోరులో నీటి మట్టం తగ్గిందన్నారు. దీంతో 15 రోజులుగా నీరు సరఫరా కాలేదన్నారు. దీంతో ప్రజలు చేతిపంపుపై ఆధారపడుతున్నారన్నారు. సమస్యను గుర్తించి తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించామన్నారు. త్వరలో బోరు మోటారుకు అదనపు పైపులు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

అలరించిన అర్జున తపస్మాన్



సదుం, సెప్టెంబరు 30: సదుం బట్టువారిపల్లెలోని కావమ్మ, మారయ్య ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ అవరోహణ భక్తులను అలరించింది. ఒక్కో మెట్టు నుంచి తపస్మాన్ ప్రాశస్త్యం గురించి వివరిస్తూ అర్జున వేషధారి తపస్మాన్ అగ్రభాగానికి చేరుకుని అక్కడ నుంచి వరపడిన భక్తులకు నిమ్మకాయలు కిందికి వేశారు. కార్యక్రమంలో కంకణదారులు మల్ రెడ్డి దంపతులు, నిర్వాహకులు భాస్కర రాజు, రామాంజనేయులు, చిన్న రమణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉంటే గణితం సులభతరం



లహరిని సన్మానిస్తున్న టీచర్లు

సదుం, సెప్టెంబరు 30: ఆసక్తి కలిగిన విద్యార్థులకు గణితం సులభతరమని గణిత ప్రజ్ఞాశాలి లహరి పేర్కొన్నారు. చెరుకువారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 26వ గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత అవధాన గురువు శివప్రసాద్ శిష్యురాలు లహరి గణిత శాస్త్రంలో లాజిక్కులను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం లహరిని దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కమిషనర్

కుప్పం, సెప్టెంబరు 30: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజల వద్దకు మున్సిపాల్టీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మున్సిపాల్టీ పరిధి 19వ వార్డులో ప్రజల వద్దకు మున్సిపాల్టీ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరంచారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, కూటమి నేతలు నరేష్, గోపీనాథ్, ఆర్ఆర్‌రవి, బాలాజీ, మంజునాథ్, శివ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఈఎస్‌లో వార్షిక క్రీడా-సాంస్కృతిక పోటీలు



కుప్పం, సెప్టెంబరు 30: కుప్పం పీఈఎస్ వైద్యకళాశాలలో 2024 క్రీడా-సాంస్కృతిక పోటీలు ఔరా-24ను సోమవారం డీన్ కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా-సాంస్కృతిక పోటీలు విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక అవగాహన కల్గిస్తుందన్నారు. అంతేకాకుండా శారీరక ధృడత్వం, సృజనాత్మకత వ్యక్తీకరణ, స్నేహభావం పెంపొందుతున్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



ఫారూఖ్, కందూరు హైస్కూల్ విద్యార్థులు

సోమల, సెప్టెంబరు 30: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక జరిగినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. ఈనెల 29న గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో త్రోబాల్ అండర్-19 ఎంపిక జరిగింది. ప్రతిభ కరబరిచిన సోమల హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఫారూఖ్, కందూరు హైస్కూల్‌కు చెందిన లహరి, రుచిత, దినేశ్, రాహుల్ రాష్ట్రస్థాయి వైజాగ్‌లో జరిగే పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

వి.కోట, సెప్టెంబరు 30: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని జడ్పీ వైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వి.కోట మండలం ముదరందొడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రిగ్ మెమోరియల్ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఖోఖో పోటీలను మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను ప్రావీణ్యం సంపాదించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. అండర్-17 ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో ముదరందొడ్డి క్రీడాకారులు విజేతలుగా, పాముగానిపల్లె క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో పాముగానిపల్లె విద్యార్థులు విజేతలుగా, బైరెడ్డిపల్లె విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వైస్ ఎంపీపీ లక్ష్మన్‌రెడ్డి, సర్పంచ్ దామోదర్, ఎంఈవో చంద్రశేఖర్, హెచ్‌ఎం బాలచైతన్య, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోస్ట్‌మేన్ సేవలు అభినందనీయం



కల్లూరు, సెప్టెంబరు30: పోస్ట్‌మేన్ రాధాకృష్ణ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని చిత్తూరు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతి తెలిపారు. కల్లూరు పోస్ట్‌మేన్‌గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చెందిన రాధాకృష్ణకు కల్లూరు తపాలా కార్యాలయంలో ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్పీఎం విక్రమ్, బీపీఎంలు సుదర్శన్‌రావు, రవి, ఏబీపీఎంలు మహబూబ్‌బాషా, ఇర్షాద్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కరకమందలో రాత్రి పూజలు



సోమల,సెప్టెంబరు30: కరకమందలో రాత్రి నడివీధి గంగమ్మకు పూజలు జరిపారు. మహిళలు పొంగళ్లు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆసాదివారు వలస దేవర్ల ప్రాధాన్యతను వివరించారు. జంతు బలి జరిపి పంటపొలాల్లో చల్లి పంటలు సుభిక్షం గా పండాలని, వర్షాలు కురవాలని వేడుకున్నారు.

బోయకొండ దసరా ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

చౌడేపల్లె, సెప్టెంబరు30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ దసరా ఉత్సవాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆలయ ఈవో ఏకాంబరం ఆహ్వానించారు. సోమవారం ఈవో చిత్తూరులో కలెక్టర్‌ను కలిసి దుశ్శాలువాతో సన్మానించి దసరా మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆయనకు అందించి ఆహ్వానించారు.

సీఎంను కలిసిన కుప్పం నేతలు



కుప్పం, సెప్టెంబరు 30: ముఖ్యమంత్రి చంద్రబాబును విజయవాడలో కుప్పం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, వడ్డెర్ల సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌లు సోమవారం కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి వివరించారు. మరికొన్ని సమస్యలను ఏకరువు పెట్టి, సీఎం నుంచి పరిష్కారాలు పొందారు మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలిసి మాట్లాడారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పలమనేరు, సెప్టెంబరు30 : పలమనేరులోని మదనపల్లి రోడ్డు గుండుబావి సమీపంలో సోమవారం కర్ణాటక నుంచి 480 టెట్రాప్యాకెట్లు స్కూటర్‌లో తీసుకు వస్తున్న ముసలిమడుగు గ్రామానికి చెందిన తేజ(21)ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ స్వర్ణతేజ తెలిపారు. దీంతో స్కూటర్‌ను, టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని తేజను అరెస్టుచేసి కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 30,240 కాగా స్కూటీ విలువ సుమారు రూ. 25, 000 ఉంటుందని తెలిపారు.

పలమనేరు రేంజర్‌గా నారాయణ

పలమనేరు, సెప్టెంబరు30 : పలమనేరు ఫారెస్టు రేంజర్‌గా సోమవారం నారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రేంజర్‌గా పనిచేస్తున్న శివన్న రాజంపేటకు బదిలీ కాగా ఆయన స్థానంలో రాజంపేటలో పనిచేస్తున్న నారాయణ పలమనేరుకు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలమనేరు రేంజి పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

పంచాయతీల వారీగా టీఏల కేటాయింపు

కల్లూరు, సెప్టెంబరు 30: పులిచెర్ల మండలంలో పంచాయతీల వారీగా ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లను కేటాయించామని ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఏపీఓ షౌకత్ తెలిపారు. పాతపేట, 102ఈ.రామిరెడ్డిగారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, రాజులపల్లి, పాళెం, రేణుమాకులపల్లెలకు టెక్నికల్ అసిస్టెంట్‌గా శోభారాణి, అయ్యావాండ్లపల్లి, దేవళంపేట, కమ్మపల్లి, 106 రామిరెడ్డిగారిపల్లి, రెడ్డివారిపల్లి, దిగువపోకలవారిపల్లి పంచాయతీలకు టీఏగా కీర్తి, చల్లావారిపల్లి, మంగళంపేట, గడ్డంవారిపల్లి, మతుకువారిపల్లి, కల్లూరు, వెంకటదాసరపల్లి పంచాయతీలకు టీఏగా జ్యోతీశ్వర్‌రెడ్డి, బోడిరెడ్డిగారిపల్లి, రాయవారిపల్లి, కావేటిగారిపల్లి, నన్నూరివారిపల్లి, పోళంవారిపల్లి, ఎల్లంకివారిపల్లి, పులిచెర్ల పంచాయతీలకు టీఏగా మహేంద్రను కేటాయించారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



కల్లూరు, సెప్టెంబరు 30: పులిచెర్ల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐగా మాధవస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఎక్సైజ్ ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీనివాసమూర్తి మంగళగిరి స్టేట్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

సార్వత్రిక విద్యపై అవగాహన

కల్లూరు, సెప్టెంబరు30: కల్లూరు వీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సార్వత్రిక విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో పోకల తాతయ్య మాట్లాడుతూ విభిన్న పరిస్థితుల కారణంతో పదవ తరగతి, ఇంటర్ విద్యను అభ్యసించలేక చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులకు సార్వత్రిక విద్య కార్యక్రమాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విద్యను కొనసాగించాలనే విద్యార్థులు తమకు సమీపంలోని సార్వత్రిక విద్య స్టడీ సెంటర్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సురేష్ బాబు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పలమనేరు, సెప్టెంబరు30 : పలమనేరుకు చెందిన 28 మంది పారిశుధ్య కార్మికులను సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. విజయవాడలో వరద ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి వెళ్లి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు పూలమాలవేసి, శాలువాలు కప్పి, ఒక జత దుస్తులు, స్వీట్‌బాక్సులు అందజేసి సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని కూడా మున్సిపల్ పాలకవర్గం శాలువకప్పి, పూలమాల వేసి సన్మానించారు. చైర్‌పర్సన్ చాముండేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోలాహలంగా నాలుగో సోమవారోత్సవం



ఆలయం ఎదుట భక్తుల కోలాహలం, ప్రాకారోత్సవంలో సుబ్రహ్మణ్యస్వామి, మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు

రామకుప్పం, సెప్టెంబరు 30: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక సోమవారోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన నాలుగో సోమవారోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం ఆరుగంటల నుంచే భక్తులు రాకతో రామకుప్పం భక్తజనసంద్రంగా మారింది. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. ఉదయం నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, క్యూలైన్లలో బారులుతీరి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వెండితో చేసిన కళ్ళు, చెవులు, నాగపడిగలు స్వామి వారిలో హుండీలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ప్రాకారోత్సవాలు చేయించారు. మహిళలు ఆలయ ఈశాన్యదిక్కున గల నాగులపుట్టలో పాలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు దంపతులు సంతాన ప్రాప్తి కోసం అక్కడి రావి వృక్షాలకు జోలెలు కట్టారు. పలువురు భక్తులు వీపుకు కొక్కీలు తగిలించుకుని తేర్లు లాగుతూ, దవడలకు శూలాలు, ఇంటిపై నిమ్మకాయలు గుచ్చుకుని, కావళ్ళు మోసుకుని వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని నాగులమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన క్యాదర్శులు, తెలుగుయువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్ తదితర నేతలు, పలువురు పోలీసు అధికారులు స్వామి వారిని దర్శనం చేసుకుని, అనంతరం ప్రాకారోత్సవంలో పాల్గొన్నారు. డీఎస్పీ ప్రభాకర్, కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్ళబూదుగూరు, గుడుపల్లె ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులులు తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించారు.



సోమవారోత్సవ శోభలో సుబ్రహ్మణ్యస్వామి

మున్సిపాలిటీలో రూ. 20 లక్షల పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు, సెప్టెంబరు30 : పలమనేరు మున్సిపాలిటీలో రూ.20లక్షల విలువచేసే అభివృద్ధి పనులు చేపట్టేందుకు సోమవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు ఆమోదించారు. సాధారణ నిధుల నుంచి ఈపనులు చేపట్టనున్నారు. ఈ ఏడాది జూలై 10న ఆమోదించిన మూడు పనులను చేపట్టేందుకు పిలిచిన టెండర్లను కూడా ఆమోదించారు. కౌండిన్య రిజర్వాయర్ పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు సరిపోనందున గంగన్న శిరస్సు జలపాతం నుంచి కౌండిన్య రిజర్వాయర్‌కు నీటిని అందించేందుకు ప్రతిపాదించిన అనుబంధ ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేసేందుకు సభ్యులు ఆమోదించారు. ఎంపీ నిధులనుంచి మంజూరు చేసిన రూ. 45 లక్షలతో పనులు చేపట్టలేదని కౌన్సిలర్ మురళి అధికారులను ప్రశ్నించారు. టీడీపీ కౌన్సిలర్ శారద మాట్లాడుతూ పలమనేరు మున్సిపాలిటీలో నిర్మించిన గదులను ఎప్పుడు ప్రారంభిస్తారని, రోజ్‌గార్ కాంప్లెక్సుముందు ఉన్న షాపింగ్ కాంప్లెక్సు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అనుమతులు లేకుండానే గతంలో నిర్మించారని, ప్రస్తుతం వాటిని క్రమబద్ధీకరించి ప్రారంభిస్తామని కమిషనర్ రమణా రెడ్డి తెలిపారు. ఇక రోజ్‌గార్ కాంప్లెక్సు ముందు నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్సుకు సంబంధించి గతంలో ఇచ్చిన టెండర్లు రద్దుచేయడం జరిగిందని, తదుపరి టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. గొబ్బిళ్లకోటూరు రోడ్డు అధ్వానంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేయడం లేదా రోడ్డు వేయాలని కౌన్సిలర్ శారద అధికారులను కోరారు. వివి మహల్ రోడ్డుపక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో ఆడిటోరియం నిర్మించేందుకు ఇప్పటికే డీపీఆర్ తయారు చేశారని, మళ్లీ డీపీఆర్ ఎందుకు తయారు చేసేందుకు వృథా డబ్బులు అని కౌన్సిలర్ కోదండ రామయ్య అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో కొత్తగా మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన వారు తమతమ శాఖలను కౌన్సిల్‌కు పరిచయం చేసుకొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల నుంచి ప్రజలను కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు. సెప్టెంబరు30: పట్టణ పరిధిలో దోమలు వృద్ధి చెందడంతో డెంగ్యూ, వైరల్ జ్వరాలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారిని కాపాడాలని కౌన్సిలర్లు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అమ్ములు మాట్లాడుతూ గత ప్రభుత్వపాలనలో పట్టణ పరిధిలో మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి వీఎల్ కంపెనీ నుంచి సిబ్బందిని ఏర్పాటు చేసి తాగునీరు అందించేవారని, ఎన్నికల తర్వాత టీడీపీ అధికారంలోకి రాగానే ప్లాంట్లు అన్ని మూతపడినట్లు ఆయన తెలిపారు. వాటిని వెంటనే ప్రారంభించి ప్రజలకు తాగునీరు ఇవ్వాలని కోరారు. కుక్కల బెడద ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు రోడ్డుపై తిరగడానికి భయపడుతున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ పూలత్యాగరాజు మాట్లాడుతూ దోమల నివారణకు రోజూ ఫాగింగ్ చేయాలని, లేనిపక్షంలో జ్వరాలు పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ 4వ వార్డులో తాగునీటి సమస్య, పారిశుధ్యలోపం, వీధిలైట్లు వెలగడంలేదని అధికారులు దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ రేష్మా మాట్లాడుతూ పుంగమ్మ చెరువు కట్టపై గుంతలు పడటం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి గుంతలను పూడ్చాల్సివుందన్నారు. మున్సిపల్ కమినర్ మధూసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కుక్కల బెడద తగ్గించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఏనుగుల సమస్య, గంగన్న శిరస్సు ప్రాజెక్టులపై జాప్యం వద్దు

● ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అమరనాథ రెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 30 : పలమనేరు నియోజకవర్గంలో చేపట్ట బోయే కుంకి ఏనుగుల ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టుల అనుమతుల అంశంలో జాప్యం చేయవద్దని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పలమనేరులోని తన కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఎఫ్ఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన నారాయణ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. దసరా తరువాత కుంకి ఏనుగుల ప్రాజెక్టుపై ఒక స్పష్టత వచ్చే అవకాశం వుందని, ఇందుకోసం ఇప్పటికే గుర్తించిన స్థలాన్ని, ప్రాజెక్టుకు అయ్యే అంచనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజి ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేంద్ర, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

దసరా ఉత్సవాలకు విచ్చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని బోయకొండ ఆలయ ఈఓ ఏకాంబరం ఆహ్వానించారు. అదేవిధంగా వి.కోటలోని దుర్గామాత దసరా వేడుకలకు రావాలని ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఆహ్వానించారు. మరోవైపు పలమనేరు మండలం కల్లాడు, తొప్పనపల్లి, గంగవరం మండలంలోని మేలుమాయి, మలాలమ్మదేవి ఆలయ నవరాత్రి ఉత్సవాలకు విచ్చేయాలని ఆయా ఆలయ కమిటీల సభ్యులు ఆహ్వానించారు. పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీబాలాజి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, వి.కోట మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ తదితరులు ఉన్నారు.

శాంతిపురానికి 19 కొత్త అంగన్వాడీ కేంద్రాలు

శాంతిపురం, సెప్టెంబరు 30: శాంతిపురం మండలానికి కొత్తగా 19 అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సీడీపీఓ కల్పన తెలిపారు. సోమవారం శాంతిపురంలో అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నారులకు, గర్భవతులకు పోషక ఆహారాలను సకాలంలో అందించాలని కోరారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

రామకుప్పం, సెప్టెంబరు 30: ఎంపీడీవోగా లక్ష్మీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందేలా అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నేతలు విశ్వనాథ్, వెంకటాచలం, మహ్మద్‌రఫీ, రామకృష్ణప్ప, అల్లీశీన, కేశవరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు30: పుంగనూరు-పలమనేరు మార్గంలోని రాయలపేట క్రాస్‌రోడ్డు(జైటౌన్)లో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఏతూరు పంచాయతీ రంగోనిమిట్టకు చెందిన మహబూబ్‌బాషా(26) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా పలమనేరు వైపు నుంచి వస్తున్న లారీ ఢీనడంతో మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన మహబూబ్‌బాషాను 108 వాహనం సహాయంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

పుంగనూరు రూరల్ , సెప్టెంబరు30: విద్యార్థుల నడవడికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉన్నప్పుడే క్రమశిక్షణగా ఉండగలరని బసవరాజ ప్రభుత్వ బాలిక కాలేజీ ప్రిన్సిపాల్ కమలాకర్ పేర్కొన్నారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలను కాలేజీలకు పంపడమే కాకుండమే కాకుండా వారి ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాల్సివుందన్నారు. సమావేశంలో అధ్యాపకులు విజయ్‌కుమారి, భారతి, చెంగయ్య, శ్రావణకుమార్, శివయ్య పాల్గొన్నారు.

రామకుప్పం డీటీగా అశోక్‌కుమార్



రామకుప్పం, సెప్టెంబరు 30: రామకుప్పం మండల డిప్యూటీ తహసీల్దారుగా అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా ఇక్కడ ఉన్న డీటీ దిలీప్‌కుమార్ రొంపిచెర్లకు బదిలీ అయ్యారు,

అర్జీలు తీసుకునేందుకు అధికారులు కరువు

● గ్రీవెన్స్‌డేలో అన్నీ భూ సమస్యలే

పుంగనూరు/సోమల/కల్లూరు/రొంపిచెర్ల, సెప్టెంబరు30: సోమవారం గ్రీవెన్స్‌డేలో అధికారులకు అర్జీలు ఇస్తే సమస్యలు తీరుతాయని కొండంత ఆశతో వచ్చిన అర్జీదారులకు సోమలలో అధికారులు లేక నిరాశ ఎదురైంది. సోమవారం పుంగనూరు, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సమయపాలన, అధికారులు హాజరు, ఇతర సమస్యలపై ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. అన్ని కార్యాలయాల్లోనూ ప్రధానంగా భూ సమస్యలే అధికంగా వచ్చాయి.

● సోమల తహసీల్దార్ బెన్నీరాజ్ హైకోర్టు పనిపై అమరావతికి వెళ్లారు. ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లను ప్రభుత్వం ఇటీవల నియమించినా వారు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉదయం 10-10గంటలకు ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ కార్యాలయానికి వచ్చి ఎంపీడీవో కార్యాలయంలో జరిగే స్పందనకు వెళ్లిపోవడంతో కార్యాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. మధ్యాహ్నం 1.30గంటలకు ప్రవీణ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వచ్చి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. అప్పటికే చాలామంది ఆవేదన వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.



పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

● పుంగనూరులో 10.20గంటలలోపు తహసీల్దార్ రాము, సర్వేయర్, గ్రీవెన్స్ డేకు వివిధ శాఖల అధికారులు వచ్చారు. 10.4 వరకు డిప్యూటీ తహ సీల్దార్ గదిలోని సిబ్బంది రాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. డీటీ తసీనా 11.30గంటలకు వచ్చారు. ప్రజలు రైతుల నుంచి పట్టాదారుపాసుపుస్తకాలు , వన్ బీ, ఆన్‌లైన్ సమస్యలు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల మార్పులు తదితర అంశాలపై వచ్చిన వినతులను తహసీల్దార్ రాము స్వీకరించారు.

● పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో అధికారులు సకాలంలో రావడంతో సమస్యలపై అధికారులు వినతలు స్వీకరించారు.

పలమనేరు తహసీల్దార్ గ్రీవెన్స్‌కు 6 అర్జీలు

పలమనేరు : పలమనేరు తహసీల్దార్ అన్నునాథన్ సోమవారం ఉదయం 9.45 గంటలకే కార్యాలయానికి వచ్చారు. సోమవారం గ్రీవిన్స్ డే కావడంతో ఫిర్యాదు దారులనుంచి అర్జీలను స్వీకరించారు. ఆరుగురు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బైరెడ్డిపల్లె : రెవెన్యూ కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఇద్దరు, రేషన్‌కార్డులకోసం ఇద్దరు తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. కొత్తఇండ్లలో గతంలో తమకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇంటిపట్టాలను రద్దుచేస్తారని కొందరు దుష్ప్ర చారం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు విన్నవించారు.

పాస్‌పుస్తకం కోసం ఏడాదిగా తిరుగుతున్నా..



సుగాలిమిట్ట పంచాయతీ చిన్నతాండా, భీమగానిపల్లె పరిధిలోని సర్వే నంబరు 459,463,464 మా భూమిని ఆన్‌లైన్ చేయించి, పట్టాదారు పాసుపుస్తకం కోసం ఏడాదిగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. కొత్త ప్రభుత్వంలోనైనా నాకు పట్టాదారు పాసుపుస్తకాలు అధికారులు ఇవ్వాలని కోరుతున్నా.

- రామకృష్ణానాయక్, సుగాలిమిట్ట, పుంగనూరు మండలం

వసతులు, శాశ్వత భవనాలెక్కడ?

నగరిలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఇదీ

నగరి, సెప్టెంబరు 30: జిల్లాల పునర్విభజనతో నగరి నియోజకవర్గం రెండు ముక్కలైంది. దీంతో అప్పటి ప్రభుత్వం నగరిలో ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ముందు కోడ్ రెండ్రోజుల్లో వస్తుందనగా హడావుడిగా ఆర్డీవో కార్యాలయం సైతం 2024లో ప్రారంభించారు. ఈ కార్యాలయాలన్నీ ఏర్పాటు చేశారు. అన్నీ అరకొర వసతులతో.. అద్దె భవనాల్లోనే ఇప్పటికీ కొనసాగుతున్నాయి.



● ఆర్డీవో కార్యాలయం

ఆర్డీవో కార్యాలయాన్ని 2022లో పశుసంవర్ధకశాఖ రైతుశిక్షణ భవనంలో ఏర్పాటు చేశారు. ఫర్నిచర్‌ను సమీపంలోని తహసీల్దారు కార్యాలయాల నుంచి తెప్పించుకున్నారు. సిబ్బందిని సైతం డిప్యుటేషన్‌పై కొనసాగిస్తున్నారు. పశుసంవర్ధకశాఖ సంచాలకుల కార్యాలయం కింద భవనంలో, ఆర్డీవో కార్యాలయం పైభవనంలో కొనసాగుతుండటంతో రెండు కార్యాలయాలూ సజావుగా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.

● ఆర్టీవో కార్యాలయం

ఎన్నికల కోడ్‌కు ముందు హడావుడిగా ఓ సిమెంటురాళ్ల తయారీ గోడౌన్‌లో ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎన్నికలయ్యాక గుండ్రాజుకుప్పం పంచాయతీ పరిధిలోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. అయితే ఈ కార్యాలయం ఎక్కడుందన్న విషయం చాలామందికి తెలియదు. ఎందుకంటే కార్యాలయానికి వెళ్లే దారి వద్ద మెయిన్‌రోడ్డులో కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.





అద్దె భవనంలో ఆర్టీవో కార్యాలయం - కార్యాలయానికెళ్లే కూడలిలో సూచిక బోర్డేదీ?



● డీఎస్పీ కార్యాలయం

డీఎస్పీ కార్యాలయాన్ని బాలాజీ గోల్డెన్‌సిటీలో ప్రారంభించారు. కొన్నాళ్లకు వసతులు సరిగా లేవని.. కుటుంబాల మధ్య కార్యాలయం ఉండటంతో ఇబ్బందిగా భావించారు. ఆ తర్వాత కృష్ణానగర్‌లో ఓ అద్దె భవనంలోకి మార్చారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



కంపెనీని పరిశీలిస్తున్న గాలి భానుప్రకాష్

నిండ్ర, సెప్టెంబరు 30: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం నిండ్రలోని టైరోమర్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని సందర్శించారు. నిండ్ర, విజయపురం మండలాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుపై కొందరు పారిశ్రామికవేత్తలతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టైరోమర్ కంపెనీ కాలుష్య రహితమని, ఇది భారతదేశంలోనే మొదటిగా కెనడా టెక్నాలజీతో పనిచేస్తుందని చెప్పారు. మరిన్ని ప్రోత్సాహకాలు అందజేస్తే.. మరో రూ.వంద కోట్లతో మూడు కంపెనీలు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ఛైర్మన్ బీకే జలన్ వెల్లడించినట్లు తెలిపారు. నిండ్ర, విజయపురం తమిళనాడుకు సమీపంలో ఉండటంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. అంబత్తూరు పారిశ్రామికవేత్తల అసోసియేషన్ నాయకుడు ఆర్వేల రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిండ్ర ప్రాంతంలో శ్రీవారి ఇండ్రస్ట్రియల్ పార్కు, విజయపురంలో సప్తగిరి ఇండ్రస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగి, మధ్యలో ఆగిపోయాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి ప్రోత్సాహకాలు అందిస్తే పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారని తెలియజేశారు. కంపెనీ ఎండీ ఆదర్స్ జలన్, తహసీల్దార్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల బాధ్యతల స్వీకరణ

గుడిపాల/పాలసముద్రం, సెప్టెంబరు 30: గుడిపాల సర్వేయర్‌గా గోపీనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాకాలలో పనిచేస్తున్న ఈయన్ను గుడిపాలకు నియమించారు. ● పాలసముద్రం సర్వేయర్‌గా గణేశ్ బాధ్యతలు స్వీకరించారు. గుడిపాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇదివరకు పనిచేస్తుండిన కిరణ్ చిత్తూరు భూగర్భగనుల శాఖకు బదిలీ అయ్యారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నర్సింహులు బాధ్యతలు స్వీకరించారు.

ఎస్టీ, ఎస్సీ మహిళలపై దాడులను అరికట్టాలి

సీపీఎం న్యూ డెమోక్రసీ



తవణంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

తవణంపల్లె, సెప్టెంబరు 30: ఎస్టీ, ఎస్సీ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని సీపీఎం న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం తవణంపల్లెలో సత్య శోధక్ సమాజ్ ఆవిర్భావ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివాసి జిల్లా నాయకురాలు సుగుణ, రామారావు, దొరస్వామి, వసంత, భాస్కర్, దేవిక, మమత తదితరులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఉద్యమ సేవకుల శ్రమదానం



పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెత్త తొలగింపు

నగరి, సెప్టెంబరు 30: నగరి పోలీస్‌స్టేషన్, ఓరుగంటాలమ్మ, దేశమ్మ ఆలయాల్లో 500 మంది ఓంశక్తి ఉద్యమ సేవకులు సోమవారం శ్రమదానంతో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమ సేవ సంఘం 22వ వార్షికోత్సవం, అధ్యక్షుడు అన్బలగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీటీ భాస్కర్ ఆధ్వర్యంలో పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టారు. సీఐ మహేశ్వర్, వీటీ భాస్కర్, గోవిందస్వామి పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు



బ్రాహ్మణపల్లెలో పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ, టీడీపీ నేత

వెదురుకుప్పం, సెప్టెంబరు 30: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని వెదురుకుప్పం ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. సోమవారం వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెలో పలుచోట్ల పారిశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. ఆయనవెంట తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, గ్రామ సచివాలయ ఉద్యోగులున్నారు. ● కార్వేటినగరం మండలంలోని అమ్మపల్లి, కృష్ణాపురం, సూరయ్యపాళెం, రాచపాళ్యం, ఏఎంఆర్‌కండ్రిగ తదితర గ్రామాల్లోనూ పారిశుధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేపట్టారు. డీడీవో వాణీస్వాతి, మండల కో-ఆర్డినేటరు ఏకాంబరం, ధనశేఖర్‌వర్మ పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు సహకరించండి: కమిషనర్



సమావేశంలో ప్రసంగిస్తున్న నీలమేఘం

నగరి, సెప్టెంబరు 30: మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూలుకు సభ్యులు సహకరించాలని కమిషనర్ కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ నీలమేఘం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కొరత ఉందని చెప్పారు. అజెండాలో పేర్కొన్న అంశాలను ముందుగా సభ్యులకు తెలియజేయాలని వైస్ ఛైర్మన్ వెంకటరత్నం కోరారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యం, వీధి దీపాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సభ్యులు కోరారు. అన్నిశాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపూజ

గుడిపాల, సెప్టెంబరు 30: గుడిపాలలో శివపూజను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముట్టుకూరుపల్లె, రెట్టగుంట, రామభద్రాపురం, నాగేంద్రపురం, చింతగుంటూరు, కిల్లారిపల్లె గ్రామాలకు చెందిన శివభక్తులు పాల్గొన్నారు.

పోషకాహార ఉత్పత్తుల తయారీపై అవగాహన

వెదురుకుప్పం, సెప్టెంబరు 30: పోషక విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఏబీ శ్రీలత అవగాహన కల్పించారు. సోమవారం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 30: గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీవరకు అమ్మవారికి శరన్నవరాత్రుల ఉత్సవాల నిర్వహించనున్నట్లు అర్చకుడు బి.కె.కుమార్ తెలిపారు. అలాగే బుధవారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి భక్తులతో ఊంజల్‌సేవ నిర్వహిస్తామన్నారు. మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరాలయంలో వార్షిక దసరా బ్రహ్మోత్సవాలు, సంతపేట చవటపల్లె కనకదుర్గ, బ్రాహ్మణవీధి కన్యకాపరమేశ్వరి, నీవానది రాజుగుడి, అగస్థీశ్వరాలయం, కట్టమంచి విశ్వసాయి షిరిడీ సాయి, పొన్నియమ్మ, కట్టమంచి వరదరాజస్వామి ఆలయాల్లోనూ గురువారం నుంచి ఈనెల 12వ తేదీవరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు.

VEMU INSTITUTE OF TECHNOLOGY
(AUTONOMOUS)
(Approved by AICTE,New Delhi & Affiliated to JNTUA)
Anantapuramu,Accredited by NAAC & NBA(CSE,ECE,EEE,ME &CE)
Puthalapattu(M), Pakala - 517112,Chittoor Dist
APICET-2024 CATEGORY-B & SPOT ADMISSIONS
NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2024-25
Applications are invited from eligible candidates for admission into **1st year MBA & MCA** Courses. Application forms and guidelines can be obtained from the College office or download from the website i.e **www.vemu.org.** The Last Date for submission of filed in application is **05-10-2024**. Admissions shall be made as per the directions of APSCHE guidelines
Sd/- PRINCIPAL

చట్టాలపై అవగాహన అవసరం

యాదమరి, సెప్టెంబరు 30: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన అవసరమని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. సోమవారం మార్లబండలో సివిల్ రైట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని శ్మశానానికి దారి, మంచినీటి ట్యాంకు, సీసీ రోడ్లు నిర్మించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఆర్ఐ ప్రసాద్, దళిత సంఘం కమిటీ సభ్యులు మురుగేశన్, రవి, రమణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు సింగిల్‌విండో ఆఫీస్‌లో సోమవారం మహాజనసభ తర్వాత పలువురు అధికారులు కలిసి మొక్కలు నాటారు. సీఈవో విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచి చీఫ్ మేనేజర్ మంగపట్నం మహేష్, మేనేజర్ విజయ, స్టాఫ్ అసిస్టెంట్ కలవకుంట మునస్వామి, కంప్యూటర్ ఆపరేటర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 30: గిరంపేట సత్యసాయి సంస్థాన్‌లో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం సాయిలింగేశ్వర స్వామికి భక్తులు భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం నిర్వహించారు. హాజరైన భక్తులకు పూజాద్రవ్యాలను ఉచితంగా అందజేశారు. సేవాసమితి మహిళా విభాగం, సత్యసాయి భజనమండలి, బాలవికాస్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మమ్మల్ని బానిసల్లా చూడొద్దు

ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఎల్వోల నిరసన

నగరి, సెప్టెంబరు 30: తమను బానిసల్లా చూడొద్దని నగరి ఆర్డీవో కార్యాలయం ఎదుట నియోజకవర్గ స్థాయి బీఎల్వోలుగా పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగుల



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బీఎల్వోలు

సంఘం రాష్ట్ర ట్రెజరర్ తిరుమలయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు ప్రసంగించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి విధుల పేరిట ఒత్తిడి అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయం అందుబాటులో ఉండటంతో పూర్తిస్థాయిలో క్లెయిమ్స్ సిద్ధం చేసి అక్కడున్న ఆపరేటర్‌కు అందించే సదుపాయం కల్పించాలన్నారు. పర్మినెంట్ షిఫ్టెడ్ డబుల్ ఎంట్రీ సిస్టమ్ క్లెయిమ్‌లను పోస్టాఫీసు నోటీసు ద్వారా ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే పోస్టాఫీసుకు బకాయిలు చెల్లించకపోవడంతో స్టాంప్ లేనిదే వారు క్లెయిమ్స్ తీసుకోవడం లేదన్నారు. ఇక తమకు నాలుగేళ్లుగా ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించక పోవడం సరికాదని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో వెంకటరెడ్డికి అందించారు. సీఐ మహేశ్వర్ జరిపిన చర్చల కారణంగా ఆందోళన విరమించారు.

సీఎం సహాయనిధికి రూ.25వేల విరాళం



చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న సునీల్ కుమార్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 30: టీడీపీ చిత్తూరు పార్లమెంటు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ చౌదరి సీఎం సహాయనిధికి రూ.25వేలను విరాళంగా ఇచ్చారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబుకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్ అందించారు. విజయవాడ వరదబాధితులకు అండగా తనవంతు సాయంగా ఈ మొత్తాన్ని ఇచ్చినట్లు సునీల్ కుమార్ చౌదరి తెలిపారు.

ఎల్లుండినుంచి అల్లియెల్లమ్మ దసరా ఉత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న గుణశేఖర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30: గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ ఆలయ దసరా ఉత్సవాలు గురువారం నుంచి ఈనెల 12వతేదీవరకు జరుగుతాయని మాజీ వైస్ ఎంపీపీ గుణశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. 3న అభిషేకం, కలశస్థాపన, 4న నాగాలమ్మ దేవతగా అలంకారం, 5న లక్ష్మీదేవిగా, 6న గాయత్రిదేవిగా, 7న సంతాన లక్ష్మిగా, 8న అన్నపూర్ణేశ్వరిగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న శాకాంబరి దేవిగా అలంకరిస్తారు. 12న అల్లియెల్లమ్మ గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

గుంతలమయమైన రోడ్లు



పానాటూరు వద్ద..

పల్లూరు వద్ద..

గుడిపాల, సెప్టెంబరు 30: మండలంలోని బెంగళూరు-చెన్నై, చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో గుంతలమయమైన రోడ్లతో ఇటు ప్రయాణికులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. చిత్తూరు నుంచి వేలూరు వెళ్లే మార్గంలో ఎంసీఆర్ క్రాస్, అనుప, పల్లూరు, పానాటూరు వద్ద రోడ్లు గుంతలమయమై రోజూ ప్రమాదాలు జరుగుతున్నారు. కొందరు ప్రాణాలు పోగొట్టుకోగా, మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ రహదారిని కొన్నేళ్లుగా ఇటు అధికారులకు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు మిట్టాపల్లం తెలియకుండా రాత్రివేళల్లో పడరాని పాట్లు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తహసీల్దారు కార్యాలయంలో పోస్టులు ఖాళీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 30: కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు, ఇద్దరు ఆర్ఐల పోస్టులు భర్తీ కోసం ఎదురుచూస్తున్నాయి. ఇక సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు దీర్ఘకాలిక సమస్యలపై ప్రజలెవరూ అర్జీలు సమర్పించలేదు.

శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం



యానాదులకు శ్మశానవాటిక స్థల పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 30: మొగిలి రెవెన్యూ పరిధిలోని ఊరగుట్టలోని సర్వే నెంబరు 61లో కొంతకాలంగా యానాదుల శ్మశాన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు భూస్వాములు ఆక్రమించుకున్న విషయం తెలిసిందే. దీనిపై యానాదులంతా కలసి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ సర్వే చేపట్టి సోమవారం వారికి శ్మశాన స్థల పత్రాలను అందజేశారు. సర్వేయర్ లావణ్య, రాష్ట్ర యానాది మహిళామండలి అధ్యక్షురాలు సావిత్రమ్మ పాల్గొన్నారు. కాగా, ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజలు అర్జీలు సమర్పించారు. రెవెన్యూకు 12, భూతగాదాలపై మూడు, కరిడివారిపల్లెలో శ్మశానవాటికపై ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీవో శివశంకర్, ఎంఈవో నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కబ్జా కాకుండా కాపాడండి

పెనుమూరు, సెప్టెంబరు 30: తాటిమాకులపల్లె పంచాయతీలోని విడిదిపల్లె గ్రామంలో శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వోను పంపి పరిశీలించి ఆక్రమణకు గురుకాకుండా చర్యలు చేపడతామని ఆయన గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులు చెంగల్‌రాయులు, పరందామ, పరదేశి, శంకర్, నవీన్, శాంబశివయ్య, శేఖర్, ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

గుడిపాల, సెప్టెంబరు 30: మండలంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో మండలంలోని చెరువులను కొందరు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

పాలసముద్రం, సెప్టెంబరు 30: మండలంలో రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ వరలక్ష్మి ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో ఆమె సమీక్షించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలను ఆయా పంచాయతీలకు చెందిన వీఆర్వోలు పరిశీలించి తన దృష్టికి తీసుకొస్తే, పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు. వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు తగ్గిపోయిన ఆర్టీసీ సర్వీసులు



ఆటోలో ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

విజయపురం, సెప్టెంబరు 30: మండలంలో చాలా గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు తగ్గిపోయాయి. దీంతో ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ప్రధానంగా పోతురాజులుకండ్రిగ, మంగళం, ఎం.అగరం, కాళికాపురం, జీఎంపురం, బూచివానత్తం, ఆలపాకం గ్రామాల విద్యార్థులైతే ఎక్కువగా ఆటోల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సరిపడా సర్వీసులు నడపాలని స్థానికులు కోరుతున్నారు.

సప్తకన్నికలమ్మ దేవతలకు మారుపొంగళ్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30: పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె గుట్టలో సప్తకన్నికలమ్మ దేవతలకు మారుపొంగళ్లను భక్తులు సమర్పించారు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన మహిళలు పొంగళ్లు, పూజా సామగ్రి తట్టలను తలపై పెట్టుకుని పంబలవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గుట్టపైకి తీసుకొచ్చారు. అక్కడ సప్తకన్నికలమ్మకు మారుపొంగళ్లు సమర్పించి, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడికొచ్చినవారికి ప్రసాదాలను పంచిపెట్టారు.

సప్తకన్నికలమ్మ పూజల్లో పాల్గొన్న భక్తులు →



టీటీడీకి 16 ఎలక్ట్రిక్ స్కూటర్ల వితరణ



టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్ ద్వారా తాజా సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక పది ఎలక్ట్రిక్ బైక్‌లు విరాళంగా అందాయి. రూ.16లక్షలు విలువచేసే టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు సోమవారం సాయంత్రం స్థానిక టీటీడీ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం దాతలైన స్థానిక శ్రీనివాస టీవీఎస్ డీలర్ ఓనర్స్ పి.భక్తవత్సలం, పి.ఆర్.సిద్ధార్థలు ట్రాన్స్‌ఫోర్ట్ జీఎం శేషారెడ్డికి వాహనాలతో పాటు సంబంధించిన దస్త్రాలను అందజేశారు.

విద్యార్థికి సత్కారం



భార్గవ్‌ను సన్మానిస్తున్న వల్లేరు అమర్‌నాథ నాయుడు

యాదమరి, సెప్టెంబరు 30: పీఈఎస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న భార్గవ్ ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో రీజనల్ చాంపియన్‌గా నిలిచాడు. దీంతో సోమవారం ఆ విద్యార్థిని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు సన్మానించారు. రూప్‌సాయి, కృష్ణబాబు, కృష్ణమూర్తి నాయుడు, మదన్ పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 30: కార్వేటినగరంలోని శ్రీలక్ష్మీనరసింహా విద్యాసంస్థలో ముందస్తుగా సోమవారం దసరా వేడుకలను నిర్వహించారు. 9 రకాల మహాశక్తుల అవతారాలతో విద్యార్థుల వేషధారణ అలరించింది. సంస్థ అధినేత దిలీప్‌కుమార్, డైరెక్టర్లు వెంకటేష్, ధనంజయరెడ్డి, పురుషోత్తం, హెచ్ఎం జమున పాల్గొన్నారు.

సన్మానం



చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 30: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెస్ అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ఎన్నిక జరగడంతో సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు గజేంద్ర, జయకుమార్, వెంకటస్వామి, సాబు, చిన్ని తదితరులు సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ

జీడీనెల్లూరు సీఐగా లక్ష్మీనారాయణ



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30: గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు కొత్త సీఐగా లక్ష్మీనారాయణ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లాలో మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇంతకు ముందు వరకు చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మన్న ఇన్‌చార్జిగా పనిచేసిన విషయం తెలిసిందే.

ఎక్సైజ్ అర్బన్, రూరల్ సీఐలుగా శ్రీహరిరెడ్డి, పురుషోత్తం



శ్రీహరి రెడ్డి

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 30: చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐగా పి.శ్రీహరిరెడ్డి, రూరల్ సీఐగా ఎ.పురుషోత్తం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చంద్రగిరిలోని శ్రీహరిరెడ్డి, గుంతకల్ స్టేషన్‌లోని పురుషోత్తం బదిలీపై ఇక్కడికొచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన వీరిద్దరూ గతంలో చిత్తూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లో సీఐలుగా పనిచేశారు.

కార్వేటినగరం ఏడీఈగా చంద్రనాయక్



వెదురుకుప్పం, సెప్టెంబరు 30: కార్వేటినగరం ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈగా చంద్రనాయక్ సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. నాగలాపురంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తుండిన నాగరాజు బదిలీపై తిరుపతికి, ఏఈ రియాజ్ చిన్నగొట్టిగల్లుకు వెళ్లారు.

ఆవలకొండ ఏఈగా తనిగవేలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30: తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ విద్యుత్‌శాఖ ఏఈగా ఆర్.తనిగవేలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు బంగారుపాళ్యం మండల రూరల్ ఏఈ పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ గంగాధరనెల్లూరు రెగ్యులర్ ఏఈ రాజా ఇన్‌చార్జిగా పనిచేశారు.